4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శనివారం 4 నవంబర్ 2023
www.ntnews.com

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# పచ్చటి పాలనా? నెత్తుటి కాలమా?

'తుపాకుల మోతలతోటి తూరుపు తెల్లారవట్టే.. గుట్టాపక్కల శవం జూసి గుర్తూ పట్టుట కష్టమాయె.. కుళ్లీ పోయిన బిడ్డల ఒళ్లులు గండూచీమలు తినుడు జూసి.. కాలు మీద పుట్టుమచ్చలు తెలంగాణ జిల్లాలోన.. కన్నా కొడుకుల రూపులు తెలిపే తెలంగాణ పల్లెలోన..' రాష్ట్రం ఏర్పడకముందు తెలంగాణ పల్లెల పరిస్థితికి ఈ పాట అద్దం పడుతుంది. పోలీసుల దాడులు, ఎన్‌కౌంటర్లతో రక్తమోడుతున్న కాలం. తినడానికి తిండి లేదు, పొలాలకు నీళ్లు లేవు, కనీసం గౌరవంగానైనా బతికే పరిస్థితి తెలంగాణల లేదు. ఎక్కడ ఎన్‌కౌంటర్ జరుగుతుందో, ఏ తల్లికి కడుపు శోకం మిగులుతుందో తెలువని భయానక పాలన అది.

పాలస్తీనా గాజాలో తల్లులు తమ పిల్లలకు కంకణాలు కడుతున్నారట. పిల్లలు ఇజ్రాయెల్ బాంబు దాడుల్లో మరణిస్తే.. ప్రాణాలు కోల్పోయిన తమ పిల్లల మృతదేహాలనైనా గుర్తుపట్టి కడచూపుకు నోచుకోవాలన్న ఆశ వారిది. పాలస్తీనా గాజా పరిస్థితి గురించిన వార్తలు చదువుతున్నప్పుడు నాకు నాటి తెలంగాణలోని పరిస్థితి గుర్తుకువచ్చి గుండె పిసికినట్టయింది.



గోసుల మల్లికాయాదవ్
98492 90606





నిజమే.. నాడు ఎంత ఆవేదన అనుభవించాం. ఎంత దుఃఖం దిగమింగాం. మా ఆదిలాబాద్ ప్రాంతానికి కేసీఆర్ వచ్చినప్పుడు ఒక మాట చెప్పారు. ఆ మాటను మా ప్రాంత ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరు. 'అవ్వల్లారా, అయ్యల్లారా! నేను మీ పిల్లలను చదువులు ఇడిసిపెట్టి రోడ్లమీదికి రమ్మని చెప్తలేను. మీ పిల్లలను ఎన్‌కౌంటర్ గమ్మని చెప్తలేను. నాకు ఓటెయ్యమని అడుగుతున్న. నేను తెలంగాణ రాష్ట్రం సాధిస్తా. పచ్చని తెలంగాణను మీ చేతుల పెడుత'నని కేసీఆర్ చెప్పిన మాటలు మా మనసులను కదిలించినయి. ఆలోచింపజేసినయి. కేసీఆర్ వెంట జెండా పట్టుకనడిచినం. కేసీఆర్‌ను నమ్మినం. మా కోసం కేసీఆర్ మృత్యువు ఒడిలో తలబెట్టి సవాలు విసిరారు. అంతిమంగా తెలంగాణను సాధించారు. సాధించిన తెలంగాణను తోడేళ్ల పాలు చేయలేదు. ఎందుకంటే ప్రజల కష్టసుఖాలు కేసీఆర్‌కే తెలుసు. అందుకనే ముఖ్యమంత్రిగా కేసీఆర్ అధికారం చేపట్టాలని, రాష్ర్టాన్ని గట్టెక్కించాలని అందరూ కోరుకున్నరు. రాష్ట్ర పగ్గాలు చేపట్టిన కేసీఆర్ ఏమేం చేశారనేది ప్రజలందరికీ తెలుసు.

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను కన్నబిడ్డలోలె సాకుతున్నడు. కంటికి రెప్పలా కాపాడుకుంటున్నడు. కడుపు నిండా అన్నం బెడుతున్నడు. ఇంటింటికీ మంచినీళ్లిస్తున్నడు. అన్నిటికి మించి నెత్తురోడుతున్న తెలంగాణను పచ్చని తెలంగాణగా మార్చిండు. ఈ ఒక్క కారణం చాలదా కేసీఆర్‌కు చేతులెత్తి మొక్కడానికి!

ఎక్కడ కాల్పుల శబ్దం వినబడతదో, ఏ నోట ఎన్‌కౌంటర్ మాట వినవలసి వస్తదో అని కన్నతల్లులు గుండె చిక్కబట్టుకొని బతుకవలసిన పరిస్థితి ఇవాళ లేదు. ఎన్‌కౌంటర్ జరిగిన కాడికిపోయి, దడదడలాడుతున్న గుండెతో, కన్నీళ్లను కొంగుతో అద్దుకుంటా, ఆ పడి ఉన్నది నా కొడుకు కాదు గదా అని మొహాన్ని చూడటం, ఆ కాల్చిచంపినోళ్లు పిల్లాడి మొహాన్ని చెక్కివేస్తే, కాలుమీది మచ్చల కోసం వెతకడం, ఏ తల్లికైనా ఎంత గుండెకోత! ఆమె కొడుకు కాకపోయినా, ఏ తల్లి కొడుకో కదా అనే బాధ గుండెను పిసుకుతూ ఉంటుంది! అంటూ ఒక తల్లి పడే కడుపుకోత బాధను వర్ణించాడో కవి. 'రాతి బొమ్మల్లోన కొలువైన శివుడా, రక్తబంధం విలువ నీకు తెలియదురా' అంటూ ఘోషిస్తుంది తల్లి హృదయం. అలాంటి ఎందరో తల్లుల కడుపు కోతను తెలంగాణ తల్లి అనుభవించింది. ఆ బాధ ఇప్పుడు తెలంగాణలో ఏ తల్లికీ లేదు.

> ఇప్పుడు తెలంగాణ బిడ్డలు గురుకులాల్లో చదువుతున్నారు. హాస్టల్ పిల్లలకు అన్నం కూరలు కొలిచిపెట్టే దౌర్భాగ్యం లేదు. కడుపు నిండా సన్నబియ్యంతో అన్నం తింటున్నారు. రైతుకు పంట అమ్ముడుపోదనే బాధ లేదు. వ్యవసాయం అంటే దండుగ కాదు, పండుగ. కులవృత్తులు కళకళలాడుతున్నాయి. ఫ్లోరోసిస్ బాధ లేదు. కలుషిత జలాల వల్ల రోగాలు రావడం లేదు. వృద్ధులు కూడా ఆత్మగౌరవంతో బతుకుతున్నారు. ఇంతకన్నా ప్రజలు కోరుకుంటున్నదేమీ లేదు.

ఈ నెల చివరన పోలింగ్ జరుగుతుంది. మనం ఎవరికి ఓటెయ్యాలి? పచ్చని తెలంగాణకు ఓటేద్దామా? నెత్తురోడుతున్న తెలంగాణకు ఓటేద్దామా? మళ్లీ నెత్తురోడే కన్నబిడ్డల కండ్ల ముందే కాటికిపోయే రక్తపు మడుగుల తెలంగాణను కోరి కోరి తెచ్చుకుంటమా? తెలంగాణను రక్తపు మడుగుల్లో ముంచింది ఎవరు? కాంగ్రెస్ పార్టీ నాయకులే కదా? చరిత్ర పొడుగునా తెలంగాణను నెత్తుటేర్లలో ముంచింది, దగా, మోసం చేసింది కాంగ్రెస్ పార్టీ కాదా? సైనిక చర్యతో తెలంగాణను ఇండియన్ యూనియన్‌లో కలిపిన తర్వాత, చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించకుండా, అనేక మందిని కాల్చిచంపిన చరిత్ర కాంగ్రెస్‌దే కదా? రెండేండ్ల సైనికపాలన అంతా రక్తసిక్తంగా సాగింది. ఇతర ప్రాంతాల అధికారులను తెచ్చిపెట్టి తెలంగాణ ఉద్యోగులను, ప్రజలను బానిసల్లాగా చూసింది కాంగ్రెస్ పార్టీ కాదా?

1952లో ముల్కీ ఉద్యమం చెలరేగినప్పుడు, సిటీ కాలేజీలో పిల్లలను కాల్చి చంపడానికి కారణం ఈ కాంగ్రెస్ పాలకులే కదా? వద్దు వద్దని ఎంతకోరినా, తెలంగాణను బలవంతంగా ఆంధ్రాతో విలీనం చేసిన పాపం కాంగ్రెస్‌ది కాదా? పెద్ద మనుషుల ఒప్పందాన్ని కాలరాసింది కాంగ్రెస్ నాయకులే. మన పిల్లలకే మన ఉద్యోగాలు వచ్చేవిధంగా నిజాం కాలంలోనే ముల్కీ నిబంధనలు వచ్చినయి. ముల్కీ నిబంధనలు చెల్లుబాటవుతాయని, రాజ్యాంగబద్ధమే అని సుప్రీంకోర్టు కూడా తీర్పునిచ్చింది. అయినా సరే, పార్లమెంటు ద్వారా చట్టం చేసి, ముల్కీ నిబంధనలు చెల్లకుండా చేసి, మన ఉద్యోగాలను మనకు కాకుండా చేసింది ఈ కాంగ్రెస్ నాయకులే గదా?. 1969 ఉద్యమం ఉవ్వెత్తున లేచినపుపడు మన విద్యార్థులను పిట్టల్లా కాల్చి చంపించింది కాంగ్రెస్ పార్టీనే. ప్రజలు అంతగా కోరుతున్నప్పుడు తెలంగాణ రాష్ట్రం ఇవ్వడం ప్రజాస్వామ్య నీతి. కానీ ఇవ్వకుండా కాల్పులతో మారణహోమం సృష్టించింది. ఆరేండ్ల పసికూన కూడా కాల్పుల్లో మరణించింది. ఎదురైన యువకుల నొసటిపై తుపాకీ పెట్టి కాల్చిచంపడం ఎంత ఘోరం.

ఇట్లా విచక్షణారహిత అణచివేతలో వందల మంది బలయ్యారు. ఆ రక్తపు చేతులు కాంగ్రెస్ పార్టీవే. అందుకే తెలంగాణ వాళ్లకు కాంగ్రెస్ హస్తం గుర్తు రక్తంతో కనిపిస్తుంది. ఇంద్రవెల్లి కాల్పులు జరిపి అనేకమంది గిరిజనుల ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే కదా? తెలంగాణ ఇస్తమని టీఆర్‌ఎస్‌తో పొత్తు పెట్టుకొని, ఉమ్మడి ప్రణాళికలో పెట్టి కూడా, రాష్ట్రపతి ప్రసంగంలో చేర్చి కూడా మోసం చేసింది కాంగ్రెస్ నాయకులే కదా? 'మీ కోరిక ఏంటో నాకు తెలుసు, అది, నెరవేరుస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన సోనియా గాంధీ ఆ తర్వాత మాట మార్చి బహిరంగసభలో ప్రసంగం చివర 'జై ఆంధ్రప్రదేశ్' అని నినాదం చేసింది తెలంగాణ ప్రజలు ఇంకా మరిచిపోలేదు.

> కేసీఆర్ ప్రాణాలను పణంగా పెట్టి దీక్షకు దిగితే, తెలంగాణ ప్రకటన చేయించి, ఆ తర్వాత మొండిచేయి చూపింది కాంగ్రెస్ పార్టీయే. అందుకే కాంగ్రెస్ హస్తం గుర్తు చూస్తే, తెలంగాణ వారికి మొండి చేయి గుర్తుకు వస్తుంది. కాంగ్రెస్ పార్టీ నాయకుల ఊగిసలాట వల్ల ఎంత మంది పిల్లలు బలిదానాలు చేసుకోవలసి వచ్చింది! ఆ పాపం కాంగ్రెస్ నాయకులది కాదా?

ఒకవైపు టీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు పదవులను తృణప్రాయంగా భావించి రాజీనామాలు చేస్తుంటే, వలస పాలకులకు దాసోహం అంటూ పదవులు పట్టుకొని వేల్లాడింది కాంగ్రెస్ నాయకులు కాదా? చిన్నారెడ్డి మొదలుకొని ప్రతి నాయకుడూ తెలంగాణ జెండా పట్టుకొని, పదవి ఇవ్వగానే, ఆంధ్రా పాలకులకు ప్రణమిల్లడం తెలిసిందే. వెన్నెముక లేని కాంగ్రెస్ నాయకులు అధిష్ఠానం దగ్గర మోకరిల్లుతారే తప్ప, తెలంగాణ ఆత్మగౌరవాన్ని చాటలేరు. ఢిల్లీ పాదుషాల కాళ్లు పిసికే చేతులు, హస్తం గుర్తులు మనకు వద్దు. కష్టాలు, కన్నీళ్లు, ఎన్‌కౌంటర్లు, బొంబాయి దుబాయి వలసలు, ఫ్లోరోసిస్ పీడలతో కూడిన దుర్భర జీవితాలు మనకు వద్దు. మన పిల్లలను మళ్లీ ఆ దుర్మార్గుల పాలనలోకి తోయవద్దు. మన పిల్లల భవిష్యత్తును అంధకారం చేయవద్దు. ఈ విషయంలో కాంగ్రెస్ నాయకుల మాయ మాటలను మనం నమ్మకూడదు. మన పిల్లలకు బతుకులకు భరోసా లేని, నెత్తురోడే కాలం మనకు వద్దు. నాటి పాపిష్టి రోజులను మళ్లీ తెచ్చుకోవద్దు. కాంగ్రెస్‌కు ఓటేసి ఆ పాడు కాలం మళ్లా తెచ్చుకోవద్దు. ఆ కష్టాలు, కన్నీళ్లు మనకు వద్దు. పచ్చటి తెలంగాణకే మన ఓటు వేద్దాం. కేసీఆర్‌నే గెలిపించుకుందాం.

(వ్యాసకర్త: టీ కేసీఆర్ సెంటర్)

---

# కోతలెవరివి? చేతలెవరివి?

24 గంటల నిరంతర విద్యుత్తు ఇచ్చింది బీఆర్‌ఎస్. కానీ, విసన కర్రలతో విసురుకొని సరిపెట్టుకొండని కాంగ్రెస్ చెప్పకనే చెప్తున్నది. రాత్రిళ్లు కరెంటు వచ్చాక, బావుల దగ్గరికి వెళ్లి మోటర్లు వేసుకునే పరిస్థితి లేకుండా చేశామని బీఆర్‌ఎస్ గొంతెత్తి చెప్తున్నది. 24 గంటల కరెంటు ఎందుకని, రైతులకు 3 గంటల కరెంటు చాలునని చెప్తున్న కాంగ్రెస్‌ను చూడండి.



జూలూరు గౌరీశంకర్



కరెంటు తీగల మీద బట్టలు ఆరేసుకునే దశ లేకుండా చేశామని బీఆర్‌ఎస్ అంటున్నది. కర్ణాటకలో ఫీజులు ఎగిరిపోయిన కరెంటును తెలంగాణ అంతటా తెస్తామని కాంగ్రెస్ చెప్తున్నది. తెలంగాణ వెలుగు జిలుగుల వన్నెతో దేదీప్యమానంగా వెలుగుతున్నదని బీఆర్‌ఎస్ ఘంటాపథంగా చెప్తున్నది. మళ్లీ గతకాలపు చీకట్లలోకి తీసుకుపోతామంటున్న కాంగ్రెసు కథలు వింటున్నారా?

'దళితబంధు' లాంటి పథకాలను తెచ్చి విప్లవాత్మకమైన ఆవిష్కరణ చేశారు ముఖ్యమంత్రి కేసీఆర్. దళితుల జీవితాల్లో నూతన వెలుగులు తెచ్చామని, ఈ దేశంలో ఎవరూ చేయలేని పని మేం చేశామని బీఆర్‌ఎస్ చెప్తున్నది. దళితబంధుకు అడుగడుగునా అడ్డుపడుతూ దళితవాడల్లోనే మగ్గిపోండని కాంగ్రెస్ విధానాలు 75 ఏండ్లుగా చెప్పకనే చెప్పాయి. ఆర్థికవ్యవస్థను నడిపే శక్తులుగా, ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా దళితులు నిలవాలని, దళిత ఆర్థిక వ్యవస్థలుగా వాళ్లు గెలవాలని కోరుతూ కేసీఆర్ దళిత సంక్షేమకారుడిగా నిలిచాడు. 75 ఏండ్లుగా కాంగ్రెస్, బీజేపీ పాలనలో ఊరికి దూరంగా దళితవాడల్లో మగ్గుతూ బతుకీడ్చేలా చేసిన కాంగీ, బీజేపీలను దళితులు నమ్ముతారా అన్న ప్రశ్నను ఆ పార్టీలే వేసుకోవాలి. సంక్షేమ పథకాలంటే అవి దళిత, బహుజన పేద వర్గాల జీవితాల్లో వెలుగులు నింపాలన్న దార్శనిక ఆలోచనలతో కేసీఆర్ రూపొందించిన పథకాలన్నీ పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు దోహదం చేస్తున్నాయి. ప్రజల జీవన ప్రమాణాలు పెంచుకుంటూ రాష్ట్ర తలసరి ఆదాయాన్ని అభివృద్ధి చేసుకుంటూ తెలంగాణ ముందుకు సాగుతుందని బీఆర్‌ఎస్ ధీమాగా చెప్తున్నది.

75 ఏండ్లుగా పేదలను మరింత నిరుపేదలుగా మార్చి ఆత్మహత్యలు చేసుకునే దశకు తీసుకుపోయిన ఆయా పార్టీలను కోరుకోవాలా వద్దా అన్నది చైతన్యవంతులైన ప్రజలే తేల్చిచెప్తారు. రైతుబంధుతో రైతుకూలీల నేస్తంగా వ్యవసాయాన్ని అభివృద్ధి చేసి గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించి గ్రామవెలుగై నిలుస్తున్న బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలని వాళ్లు కోరుతున్నారు. పత్తి రైతుల ఆత్మహత్యల క్షేత్రంగా బీడుభూముల మట్టిదిబ్బలుగా చేసి రైతులను బిచ్చగాళ్లుగా మార్చిన పార్టీలు ఎవరో ప్రజలు గుర్తించగలరు, నిగ్గుదేల్చి చెప్పగలరు. వలస తెలంగాణను పచ్చటి పాలమూరుగా మార్చి పసిడి పంటల క్షేత్రంగా చేసిన బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలని ఆ పార్టీ కోరుతున్నది. పల్లెలు కన్నీరు పెట్టించి కానరాని కుట్రలు చేసి ఓట్లు, సీట్ల కోసం నాలుగు కాళ్ల కుర్చీల గద్దెల కోసమే తండ్లాడే కాంగ్రెస్, బీజేపీల అసలు నైజాన్ని తెలంగాణ ప్రజలు గుర్తుపట్టగలరు.

> హైదరాబాద్ నగరాన్ని అధికార కుర్చీల కుస్తీ పోటీల కోసం కత్తిపోట్ల కేంద్రంగా మార్చి మతఘర్షణలకు వత్తాసు పలికిన పార్టీ ఏదో ప్రజలు గుర్తించగలరు. కేసీఆర్ దార్శనిక ఆలోచనలతో, గంగా జమునా తెహజీబ్ సంస్కృతితో దేశానికే ఆదర్శంగా తెలంగాణను తీర్చిదిద్దుతున్నారు.

సాంఘిక, సంక్షేమ హాస్టళ్లంటే పురుగులన్నానికి కేంద్రాలనే భావనను తుడిచివేసి పేద విద్యార్థుల కంచాల్లోకి రుచికరమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్న స్థితికి తెచ్చుకున్నాం. మహాత్మా జ్యోతిబాపూలే ఆలోచనల కొనసాగింపుగా దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీవర్గాల గురుకులాలు నెలకొల్పుకున్న చరిత్ర తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుంది. ఈ ఆలోచనలు దేశమంతా విస్తరించాలని తెలంగాణ దారిచూపుతున్నది. తెలంగాణ తనను తాను పునర్నిర్మించుకుంటూ ముందుకు సాగుతున్న తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వమే ఈ ప్రాంత అభివృద్ధికి ఆయువుపట్టుగా నిలుస్తుంది. ఈ పదేండ్ల పాలన పేదవర్గాలకు అండదండలిచ్చిన పాలనగా ఊరవతల వెలివాడల్లో మూలుగులను విని, అట్టడుగు పొరల్లో అభివృద్ధి నమూనాలు తీర్చిదిద్దిన ఒక చారిత్రక సందర్భంగా, చేతివృత్తులకు చేయూతగా, గీత, నేతలకు నిజమైన అండదండగా చేతల ప్రభుత్వంగా తెలంగాణ నిలిచింది. ఇది ఉండాలి. ఈ ఆలోచనలు కొనసాగాలి. తెలంగాణ దేశానికి ధాన్యాగారంగా ఎలా నిలిచిందో అన్ని రంగాల్లోనూ పరిపుష్ఠంగా ఎదగాలని ఈ ఎన్నికల వేళలో చర్చ జరగడమే ప్రజాస్వామ్యానికి ప్రాణంగా నిలుస్తుంది.

---

తరతరాలుగా వెనుకబడిన ముదిరాజుల అభివృద్ధికి కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు గత 58 ఏండ్లలో చేసిందేమీ లేదు. కీ.శే.కృష్ణస్వామి ముదిరాజ్ లాంటి సంఘసంస్కర్తలు తమంతట తాము సామాజిక రంగంలో ఎదిగి, పేరు ప్రఖ్యాతులు సంపాదించి, ముదిరాజులను సంఘటితం చేశారు. గత కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాల వైఫల్యాలతో, అనాలోచిత నిర్ణయాలతో ముదిరాజులు తమ కులవృత్తి, జీవనోపాధి కోల్పోయి వెనుకబడటం ద్వారా రాజకీయరంగంలో ఎదగలేకపోయారు.

# కేసీఆర్‌తోనే ముదిరాజ్‌ల అభివృద్ధి



లాలారాము ముదిరాజ్
93461 38138



తెలంగాణ రాష్ట్ర సాధనలో ముదిరాజులు పోషించిన పాత్రను, వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను గమనించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం మొదటగా ముదిరాజులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే దూరదృష్టితో ఆలోచించి తదనుగుణంగా ముందుకువెళ్లింది. స్వాతంత్ర్యం సిద్ధించిన 64 ఏండ్లలో లేని ప్రగతిని కేవలం పదేండ్లలోనే కేసీఆర్ ప్రభుత్వం చేసి చూపించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటగా తెలంగాణ రాష్ట్ర న్యాయవ్యవస్థలో అనేక మంది 'ముదిరాజు' న్యాయవాదులకు జీపీ, ఏజీపీ, స్పెషల్ జీపీలు, స్టాండింగ్ కౌన్సిల్స్, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌గా నియమించి తగు ప్రాతినిధ్యం కల్పించింది. తద్వారా ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకున్నది. అదేవిధంగా వివిధ కార్పొరేషన్లకు ముదిరాజులను చైర్మన్లుగా నియమించి, గత మంత్రివర్గంలో ఈటల వంటి వ్యక్తులకు కీలక శాఖలు కేటాయించి ముదిరాజులలో ఆత్మస్థయిర్యాన్ని నింపింది. బండ ప్రకాశ్, పిట్టల రవీందర్‌కు సముచిత స్థానాలు కల్పించింది. ముదిరాజులకు బీసీ 'ఏ' క్యాటగిరీలో స్థానం కల్పించేందుకు పోరాడుతున్న డీఎల్ పాండు లాంటి న్యాయవాదులను ప్రభుత్వ ప్లీడర్లుగా నియమించింది. ముదిరాజుల ప్రధాన వృత్తి చేపల పెంపకం. అంతేకాకుండా ముదిరాజులు పండ్ల తోటల పెంపకం, సంరక్షణ, పండ్ల ఉత్పత్తుల అమ్మకాలు చేస్తూ తమ జీవనోపాధిని గడుపుకొంటారు. చేపల పెంపకం, వృత్తి, వ్యాపారాది విషయాల్లో గత ప్రభుత్వాల హయాంలో ముదిరాజులకు జరిగిన అన్యాయాన్ని పరిగణనలోనికి తీసుకొని మొదటగా జీవో నెం 4 ద్వారా ముదిరాజ్‌లను మత్స్యకారులుగా గుర్తిస్తూ సుమారు 58 ఏండ్లుగా ముదిరాజులు పడుతున్న ఇబ్బందులను, అన్యాయాన్ని తొలగించింది. జీవో నెం.6 ద్వారా ఒక ఎకరానికి ఒకరికి సభ్యత్వం కల్పించి ముదిరాజుల సభ్యత్వాలను గణనీయంగా పెంచింది. తద్వారా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముదిరాజుల పట్ల ప్రేమను చాటుకున్నది. కోకాపేట్‌లో ముదిరాజుల కోసం సుమారు 300 కోట్ల విలువ చేసే 5 ఎకరాల స్థలం కేటాయించి, 5 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి, ముదిరాజ్ భవన నిర్మాణానికి అంకురార్పణ చేసింది. అంతేకాకుండా వెయ్యి కోట్ల బడ్జెట్‌తో 75 శాతం సబ్సిడీలతో సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నది. రూ.450 కోట్లతో బడ్జెట్‌తో మినీ వాహనాల, చేపల సరఫరాల వ్యాన్లను, బైకులను ముదిరాజులకు పంపిణీ చేయడం ఆహ్వానించదగిన పరిణామం. రూ.75 కోట్లతో మత్స్యకారుల కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, 1000 నూతన మత్స్యకారుల సొసైటీల ఏర్పాటు, రూ.75 కోట్ల రివాల్వింగ్ ఫండ్ ఏర్పాటుచేయడం, 18 ఏండ్లు నిండిన ప్రతి ముదిరాజ్ బిడ్డకు మత్స్యకారుల సొసైటీ సభ్యత్వం, చేపపిల్లల, రొయ్య పిల్లల పంపిణీ కోసం వెయ్యి కోట్లు ఖర్చుచేయడం, జీవో 268 ద్వారా సర్పంచ్‌ల అధికారాలను స్థానిక చెరువులపై తొలగించడం ముదిరాజుల అభివృద్ధి విషయంలో సాధించిన చరిత్రాత్మక విజయాలు.

దశాబ్దాల కాలంగా చేపల ఉత్పత్తి, పెంపకం వ్యాపారాలకు దూరమైన ముదిరాజులు పైన తెలిపిన పథకాలు, జీవోల ద్వారా గణనీయంగా ఎదిగి స్వావలంబన దిశగా వెళ్లేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. ముదిరాజులలో గ్రామీణ నిరుద్యోగిత లేకుండా చేయడం కేసీఆర్, బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమైంది. జీవో 4/2022 ద్వారా 58 ఏండ్ల అన్యాయాన్ని సవరించి ముదిరాజులను మత్స్యకారులుగా గుర్తించింది. జీవో నెం.74ను సవరించి జీవో నెం.43/2022ని తీసుకువచ్చి ముదిరాజులకు ప్రాజెక్టులలో చేపలు పట్టుకునే హక్కు కల్పించింది. ముదిరాజుల అభివృద్ధికి రూ.1000 కోట్ల మూలధనంతో ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడానికి పూనుకోవడం, బీసీ బంధులో తగిన పథకాలతో ఆదుకోవడం కేసీఆర్‌తోనే సాధ్యమైంది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత చెరువుల పునరుద్ధరణ, కొత్త రిజర్వాయర్ల నిర్మాణం తర్వాత వేల కోట్ల చేపపిల్లలను రిజర్వాయర్లలో పెంచడానికి వెచ్చించి, సుమారు రూ.32 వేల కోట్ల మత్స్య సంపద సృష్టించి ముదిరాజులు ఆర్థికంగా ఎదగడానికి తోడ్పడింది. ముదిరాజులు తమ అభివృద్ధికి కృతజ్ఞతగా కేసీఆర్ ప్రభుత్వాన్ని గెలిపించే దిశగా కృషిచేయాలి. కేసీఆర్ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం మన ముదిరాజుల మీద ఎంతైనా ఉన్నది.

(వ్యాసకర్త: హైకోర్టు న్యాయవాది స్టాండింగ్ కౌన్సిల్ హైకోర్ట్ ఆఫ్ తెలంగాణ)

---

## ఎటమటం



### ఇంత మతలబు ఉందా?

ఊరికే రారు మహానుభావులు అంటారు. ఇక నుంచి ఊరికే మాట్లాడరు మహానుభావులు అని చెప్పుకోక తప్పదేమో. కాంగ్రెస్ తరపున ప్రచారం చేయడానికి వచ్చిన కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ను తాండూర్‌లో జరిగిన సభలో ఎల్‌బీ స్టేడియంలో రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని అర్థం వచ్చేలా ప్రసంగించారు. ఈ వ్యాఖ్యలు సీఎం రేస్‌లో ఉన్న నాయకమ్మన్యులకు ఆగ్రహం తెప్పించాయి. మల్లికార్జున్ ఖర్గేనో, రాహుల్ గాంధో, సోనియా గాంధో ఆ మాటన్నారంటే సీరియస్‌గా తీసుకోవచ్చు కానీ ఆయన మాటలు ఎవరు పట్టించుకుంటారు... పైగా ఆయన ఏ మూడ్‌లో ఉండి అలా మాట్లాడారేమో అంటున్నారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అయితే ఈ వ్యాఖ్యలపై బాహాటంగానే స్పందించారు. సీఎం ఎవరన్నది గాయనకేం (డీకే) తెలుస్తుంది? అని ప్రశ్నించారు. ఇదిలా ఉంటే డీకే అలా ఎందుకు మాట్లాడారనే చర్చ గాంధీభవన్‌లో కాస్త సీరియస్‌గానే జరిగింది. కర్ణాటక పీసీసీ అధ్యక్షునిగా డీకే ఉన్నప్పటికీ సీఎం పోస్టు ఆయనకు దక్కలేదు. ఇక్కడ తెలంగాణలో పీసీసీ అధ్యక్షునికి సీఎం పోస్టు ఇవ్వాలని సూచించడం ద్వారా అక్కడ (కర్ణాటక) తనకు కూడా ఇవ్వాలని పరోక్షంగా డిమాండ్ చేయడమే అయి ఉంటుందని గాంధీభవన్ మేధావులు విశ్లేషిస్తున్నారు.



### పొలిటికల్ డ్రాపౌట్!

స్కూల్ డ్రాపౌట్ గురించి విన్నాం కానీ... పొలిటికల్ డ్రాపౌట్ గురించి వినడం మాత్రం బహుశా ఇదే కొత్త. గతంలో షర్మిల పార్టీలో పని చేసిన మాజీ నేత ఒకరు తాజాగా ఆమె తీసుకున్న నిర్ణయానికి స్పందిస్తూ పొలిటికల్ డ్రాపౌట్‌గా అభివర్ణించారు. ఒక రాజకీయ పార్టీ పెట్టి, ఎన్నికల కమిషన్ గుర్తు కూడా కేటాయించాక బరిలో దిగకుండానే అస్త్ర సన్యాసం చేసిన షర్మిలను పొలిటికల్ డ్రాపౌట్‌గా పిలువవచ్చు అని వ్యాఖ్యానించారు. ఎన్నికలకు ముందే రాజన్న రాజ్యం పార్టీ బిచాణా ఎత్తివేయడం మాత్రం 'సరైన సమయంలో సరైన నిర్ణయం'గా సదరు నేత అభివర్ణించారు. మరో మూడు, నాలుగు రోజుల్లో తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తున్నట్టు ప్రకటించడం ద్వారా వైఎస్ఆర్‌టీపీ అధ్యాయం ముగుస్తుందన్నారు. ఎన్నికల బరి నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించడం ఒక్కటే ఆమె తెలివిగా తీసుకున్న నిర్ణయం అంటున్నారు. పార్టీ పోయినా... పరువు దక్కిందని ఆమెతో కలిసి ఇంతకాలం పాదాల మీద పాదయాత్ర చేసిన నాయకులు కూడా మెచ్చుకుంటున్నారు. లేకుంటే తండ్రి దివంగత వైఎస్ఆర్, అన్న జగన్, తల్లి విజయమ్మ, భర్త అనిల్‌కుమార్ అందరి పరువు గంగలో కలిసేదంటున్నారు. ఎన్నికల్లో పోటీ చేయడం, అభ్యర్థులను ఎంపిక చేయడం, మ్యానిఫెస్టో ప్రకటించడం, ఎన్నికల ప్రచారం చేయడం, ఆ తర్వాత అందరి డిపాజిట్లు పోవడం వంటి ప్రమాదం నుంచి తమను తప్పించడం ద్వారా షర్మిల సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నట్టేనని పొలిటికల్ డ్రాపౌట్ క్యాడర్ మెచ్చుకుంటున్నారు.



### నిను వీడని నీడను నేను

టికెట్ కోసం ఏ పార్టీలోనైనా పోటీపడుతారు. అవసరమైతే అధిష్ఠానంతో తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధపడుతారు. కానీ విచిత్రంగా 'టికెట్ వద్దు.. ఈ సారికి వదిలేయండి ప్లీజ్' అని రాష్ట్ర బీజేపీ నాయకులు మొరపెట్టుకున్న సంగతి తెలిసిందే. నిన్నగాక మొన్న బాబుమోహన్ ఈ సారి ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని ప్రకటించారు కూడా. కానీ, మూడవ జాబితాలో అందోల్ అభ్యర్థిగా బీజేపీ ఆయనను ప్రకటించింది. 'టికెట్ వద్దన్నా.. ఇదేమి టార్చర్' అని ఆయన మండిపడుతున్నారు. 'టికెట్ ఇస్తే సరిపోదు.. పోటీ చేయడానికి ఎంత డబ్బు ఇస్తారో చెప్పండి.. దాన్ని బట్టి పోటీ చేయాలో? లేదో?' అప్పుడు నిర్ణయం తీసుకుంటానని పార్టీ ముఖ్య నాయకుడికి బాబుమోహన్ ఫోన్ చేసినట్టు సమాచారం.

- వెల్జాల